

నాటుపడవల్లో వాగు దాటుతున్న గర్భిణులు లంగరి లావణ్య, లంగరి మేఘన (ఫైల్)


నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్



## సండే సందడి

*హాజీపూర్ మండలం ర్యాలీ గఢ్‌పూర్ అటవీ ప్రాంతంలోని జలపాతం ఆకట్టుకుంటున్నది. జిల్లా కేంద్రం నుంచి 20 కిలోమీటర్ల దూరంలోనున్న ఈ వాటర్ ఫాల్స్‌ను చూసేందుకు జనం ఎగబడుతున్నారు. ప్రకృతి సోయగాల నడుమ.. ఎత్తైన గుట్టలపై నుంచి జాలు వారే నీటి ధారలు కనువిందు చేస్తున్నాయి. ఆదివారం ఆయా ప్రాంతాల నుంచి యువతీ యువకులు ఇక్కడికి వచ్చి సందడి చేశారు. జలకాలాటలాడుతూ.. సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపారు.*

*- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్*

ర్యాలీ జలపాతం వద్ద సందడి చేస్తున్న యువత



# ప్రసవం పునర్జన్మే..

## అటవీప్రాంత గ్రామాలకు రోడ్లు, వంతెనలు లేక అవస్థలు

- అంబులెన్స్‌లు వెళ్లలేని దుస్థితి
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగులు.. వంకలు దాటుతున్న గర్భిణులు
- దవాఖానకు చేరే వరకూ ప్రత్యక్ష నరకం
- జిల్లాలో యేటా అనేక ఘటనలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ) : అటవీ ప్రాంత గిరిజన గర్భిణులకు ప్రసవమంటే పునర్జన్మతో సమానమవుతున్నది. అనేక పల్లెలకు రోడ్లు, వంతెనలు లేకపోగా, అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితిలో నిండు గర్భిణులు ప్రత్యక్ష నరకం అనుభవించాల్సి వస్తున్నది. పురిటినొప్పులతో కాలినడకన వాగులు.. వంకలు.. మోకాళ్ల లోతు బురద.. రాళ్లు.. రప్పలు దాటాల్సిన దుస్థితి నెలకొంది. దవాఖానకు చేరుకునే లోపు తల్లీబిడ్డల ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోతున్నది. యేటా జిల్లాలో అనేక మంది మృత్యువాత పడుతుండగా, ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు తీవ్ర వేదనకు గురిచేశాయి.

- ఈ నెల 9న ఆసిఫాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని టిప్పన్ మోవాడ్ బండగూడకు చెందిన ఆత్రం ధర్మబాయ్ అనే ఆదివాసీ గర్భిణికి పురిటి నొప్పులు వచ్చాయి. 108కి ఫోన్ చేయగా, గ్రామానికి వచ్చే దారిలోనున్న వాగుపై వంతెన లేకపోవడంతో అవతలి ఒడ్డు వైపే వాహనాన్ని నిలిపివేశారు. కుటుంబ సభ్యుల సహకారంతో ధర్మబాయ్ గ్రామం నుంచి వాగు వరకు 1.5 కిలోమీటరు మేర నడుచుకుంటూ వచ్చింది. అతికష్టం మీద వాగు దాటింది. ఈ క్రమంలో నొప్పులు తీవ్రం కావడంతో అంబులెన్స్ సిబ్బంది డెలివరీ చేశారు. ఆడ శిశువుకు జన్మనివ్వగా, గర్భంలో మరో శిశువు ఉందని గమనించిన అంబులెన్స్ సిబ్బంది ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడికి చేరుకోగానే శిశువు మరణించింది. కడుపులో ఉన్న మరో శిశువు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మంచిర్యాల మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. అక్కడ మరో పాపకు జన్మనిచ్చింది.
- ఈ నెల 6న కెరమెరి మండలం పరస్‌వాడకు చెందిన కల్పనకు పురిటి నొప్పులు వచ్చాయి. ఆ గ్రామానికి అంబులెన్స్ వెళ్లే పరిస్థితి లేకపోవడంతో తన తల్లిదండ్రుల సాయంతో అటవీ ప్రాంతం నుంచి గుట్టలు ఎక్కి.. రాళ్లు.. రప్పలు దాటి నాలుగు కిలో మీటర్లు నడిచి కేలి(బీ)కి చేరుకున్నది. అక్కడి నుంచి ఎడ్ల బండిలో కెరమెరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి అతికష్టం మీద చేరింది. దవాఖానలో శిశువుకు జన్మనిచ్చింది.



కెరమెరి మండలం పరస్‌వాడ నుంచి రాళ్లు.. రప్పలు దాటుతూ దవాఖానకు వస్తున్న గర్భిణి కల్పన



పురిటి నొప్పులతో వాగు దాటుతున్న గర్భిణి ధర్మబాయి



వాగు ఒడ్డున ప్రసవించిన శిశువు



వాగు ఒడ్డు నుంచి ఎడ్ల బండిలో దవాఖానకు వెళ్తూ..

- గత నెల 26న భారీ వర్షాలకు బెజ్జూర్ మండలాన్ని ఆనుకొని ఉన్న ప్రాణహిత ఉప్పొంగి ప్రవహించింది. తలాయి, తిక్కపల్లి, భీమారం గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. తలాయి గ్రామానికి చెందిన లంగారి లావణ్య, లంగారి మేఘన 9 నెలల నిండు గర్భిణులు. వీరిని వైద్యం కోసం బెజ్జూర్ మండల కేంద్రానికి నాటు పడవల్లో ప్రమాదకర పరిస్థితుల్లో తరలించారు. ఆపై కాన్పుకోసం తల్లిగారి ఊర్ల(దహెగాం మండలం ఒడ్డుగూడ, రాస్పల్లి)కు వెళ్లారు.
- ఇలా జిల్లాలో అనేక గ్రామాలకు రోడ్లు, వంతెనలు లేవు. వర్షాకాలం వచ్చిందంటే ఆయా గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగులు.. వంకలు దాటాల్సి వస్తున్నది. ప్రధానంగా గర్భిణుల కష్టాలు వర్ణనాతీతం.

# నిధులున్నా పట్టింపేది..?

## కేసీఆర్ సర్కారులో వంతెనలు, చెక్‌డ్యామ్‌ల కోసం రూ. 11.70 కోట్లు మంజూరు

- అధికారంలోకి వచ్చి 10 నెలలైనా వాటి ఊసెత్తని కాంగ్రెస్
- నిధులున్నా మంత్రుల దృష్టికి తీసుకెళ్తానంటున్న ఎమ్మెల్యే వివేక్
- సొంత మీడియాలో ప్రచారంపై ప్రజల విస్మయం



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

Panchayat Raj & Rural Development Department – Chennur Constituency – CRR 2023-24 – Sanction of (4) works in Chennur Constituency of Mancherial District with an estimated cost of Rs.1170.00 Lakhs under CRR (Plain) Grant – Administrative Sanction – Accorded – Orders – Issued.

PANCHAYAT RAJ & RURAL DEVELOPMENT (ROADS) DEPARTMENT

G.O.Rt.No.367 Dated:11.08.2023

ORDER

2. The amount sanctioned in para (1) above shall be met from the following Head of Accounts:-
"MJH 4515 - Capital Outlay Other Rural Development Programme
SMJH 00 - Not applicable
MH 101 - Panchayat Raj
GH 25 - State Sector Schemes
SH 22 - Construction of Panchayat Raj Rural Roads
530 - Major Works
531 - Other Expenditure."

3. The Engineer-in-Chief, Panchayat Raj/The Superintendent Engineers/District Panchayat Raj Engineers concerned shall verify that the work is sanctioned in para (1) above are not already sanctioned/ grounded/semi finished under any other grants. Any discrepancy noticed should be brought to the notice of the Government immediately. The above instructions shall be followed scrupulously. If such work as sanctioned in this GO are already grounded etc., they shall be deemed to have been cancelled automatically and the same shall be informed to the Government immediately for taking further necessary action. The work shall be tendered/ grounded only, if the amount now sanctioned is sufficient to complete it in full shape. Any deviation from the above instructions will be dealt with severely. The work shall be taken-up as per the rules in force.

4. The Engineer-in-Chief, Panchayat Raj, shall take necessary action in the matter.

ANNEXURE
to G.O.Rt.No.367, PR & RD (ROADS) DEPARTMENT, Dated:11.08.2023

| Sl. No | District | Assembly Constituency | Mandal | Name of the Road | Length in Km. | Estimate cost Rs in Lakhs |
|---|---|---|---|---|---|---|
| 1 | Mancherial | Chennuru | Mandamarri | C/o HLB cum Check Dam on R/T R&B road @9/0 Km to Chinthalapally, via Akkepally | | 320.00 |
| 2 | Mancherial | Chennuru | Mandamarri | C/o HLB cum Check Dam on R/T MDR road Mandamarri to Sandronipalli via Shankarpalli @ 0/00 | | 250.00 |
| 3 | Mancherial | Chennuru | Chennuru | C/o HLB cum Check Dam on R/T PWD road to Andugulpet | | 300.00 |
| 4 | Mancherial | Chennuru | Chennuru | C/o HLB cum Check Dam on R/T PWD road to Pulimadugu | | 300.00 |
| | | | | Grand Total | | 1170.00 |

SANDEEP KUMAR SULTANIA
PRINCIPAL SECRETARY TO GOERNMENT

//FORWARDED :: BY ORDER//

SECTION OFFICER

బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు

చెన్నూర్, ఆగస్టు 11 : కేసీఆర్ సర్కారు చెన్నూర్ నియోజకవర్గంలో వంతెనలు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయగా, కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బ్రిడ్జిలు, చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్, కేసీఆర్‌కు విజ్ఞప్తి చేయగా, 2023, ఆగస్టు11న రూ.11.70 కోట్లు మంజూరు చేశారు. చెన్నూర్ మండలంలోని చింతలపల్లి-అక్కెపల్లి గ్రామాల మధ్యనున్న వాగుపై బ్రిడ్జి, చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.3,20 కోట్లు, మందమర్రి మండలంలోని పాలవాగుపై బ్రిడ్జి, చెక్ డ్యామ్ నిర్మాణానికి రూ 2.50 కోట్లు, అందుగుల పేట వాగుపై బ్రిడ్జి, చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ. 3 కోట్లు, పులిమడుగు వద్ద వాగుపై బ్రిడ్జి, చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ. 3 కోట్లు మంజూరు చేశారు. కానీ.. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఆ నిర్మాణాలపై ఊసెత్తడం లేదు. ప్రస్తుత ఎమ్మెల్యే వివేక్ వాటి నిర్మాణాల కోసం చొరవ తీసుకోవడం లేదు. నిధులున్నప్పటికీ వంతెనల నిర్మాణాల గురించి మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని సొంత మీడియాలో ప్రచారం చేసుకోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అత్యంత వెనుకబడిన చెన్నూర్ నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే సుమన్ అనేక అభివృద్ధి పనులు చేపట్టడమేగాక వాగులపై 22 బ్రిడ్జిలు నిర్మించి పలు గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించిన విషయం విదితమే. ఇకనైనా ఎలాంటి బేషజాలకు పోకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన బ్రిడ్జిలు, చెక్‌డ్యామ్‌లను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జి సమస్య పరిష్కరించాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ**

కాగజ్‌నగర్, ఆగస్టు 11: మండలంలోని వంజీరి రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం వంజీరి రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించిన అనంతరం అధికారులు, విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాలతో రెండు నెలలుగా వంజీరి రైల్వే అండర్ బ్రిడ్జి కింద బురదమయమైందని, ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, నాయకులు రాజ్‌కుమార్, ఓదెలు, సలీం. రాజు, రావూజీ పాల్గొన్నారు.



వంజీరి అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

# మెరుగైన వైద్యమందించాలి



కౌటాల పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్



నస్పూర్ పీహెచ్‌సీలో డీహెచ్ రవీంద్రనాయక్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది



మందమర్రి ఆరోగ్య కేంద్రంలో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీహెచ్ రవీంద్రనాయక్

- డీహెచ్ రవీంద్రనాయక్
- మూడు చోట్ల పీహెచ్‌సీలు తనిఖీ

మందమర్రి/శ్రీరాంపూర్/కౌటాల, ఆగస్టు 11 : ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలందించాలని డీహెచ్(డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్) అధికారి రవీంద్ర నాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. ఆదివారం మందమర్రిలోని దీపక్‌నగర్ కాలనీగల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీశ్‌రాజుతో కలసి తనిఖీ చేశారు. రికార్డులు, గర్భిణుల కోసం ఏర్పాటు చేసిన వెయిటింగ్ గది, ఫార్మసీ, వ్యాక్సిన్‌లను పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. వసతులు, రోగులకు అందిస్తున్న సేవల గురించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ అనిత, డాక్టర్ సీతారాం, డాక్టర్ ఫయాజ్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస, డాక్టర్ శివప్రతాప్, డీపీవో ప్రశాంతి, పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు. నస్పూర్ మున్సిపాలిటీ యూపీహెచ్‌సీని ఆదివారం వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర డైరెక్టర్ బీ రవీందర్ నాయక్ సందర్శించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్, డాక్టర్లు సీతారామరాజు, అనిత, ఫయాజ్, సుచరిత, శివ, ప్రతాప్, మానస స్వాగతం పలికారు. అనంతరం డైరెక్టర్ దవాఖాన అన్ని విభాగాల సేవలను పరిశీలించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ఎలాంటి సమస్యలున్నా డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు విశ్వేశ్వర్‌రెడ్డి, బుక్క వెంకటేశ్వర్, జిల్లా మాస్ మీడియా అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**కౌటాలలో..**

కౌటాల మండల కేంద్రంలోని పీహెచ్‌సీని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ శనివారం రాత్రి పరిశీలించారు. ఆపరేషన్, ఓపీ, ఇన్‌పేషెంట్ రూంలు, ఫార్మసీ, ల్యాబ్ ఇతర గదులను పరిశీలించారు. ఈ నెల 9న 'నమస్తే తెలంగాణ'లో 'జాతీయ స్థాయి దవాఖానలో వైద్యుల్లేరు' శీర్షికన కథనం ప్రచురితమవ్వగా, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్‌గా తీసుకున్నట్లు ఆయన తెలిపారు. దీనికి గల కారణాలను తెలుసుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో హెల్త్ డైరెక్టర్ రవీంద్ర నాయక్ హైదరాబాదు నుంచి శనివారం రాత్రి కౌటాలకు చేరుకున్నారు.

# పోరాట యోధుడు గద్దర్

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ, ఉస్మానియా ప్రొఫెసర్ ఖాసీం
- కాగజ్‌నగర్‌లో గద్దర్ సంస్మరణ సభ

కాగజ్‌నగర్, ఆగస్టు 11: ప్రజాయుద్ధ నౌక గద్దర్ అణగారిన వర్గాల పోరాట యోధుడని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని సంతోష్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన గద్దర్ సంస్మరణ సభకు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సభ నిర్వాహకులు రాజయ్య, జయదేశ్ అబ్రహం, రాజ్‌కమాలాకర్‌రెడ్డి, నాయకులు గణపతి, లెండుగూరే శ్యాంరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు శాంతికుమారి, మేడి చరణ్‌దాస్, ఏటూకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.




గద్దర్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

# ఉప్పొంగిన వాగులు నిలిచిన రాకపోకలు

- వ్యవసాయ పనులకు వెళ్లి వస్తుండగా పెరిగిన ఉధృతి
- గంటల తరబడి వేచి ఉన్న రైతులు, కూలీలు
- రాత్రి ట్రాక్టర్ల ద్వారా దాటించిన నాయకులు

చింతలమానేపల్లి, ఆగస్టు 11 : మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి దిందా-కేతిని, శివపెల్లి వాగులు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం కేతిని రైతులు దిందా శివారులోకి, దిందా రైతులు కేతిని శివారులోకి వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం తిరిగి తమ గ్రామాలకు వస్తున్న క్రమంలో వాగులు ఉప్పొంగాయి. దీంతో వాటిని దాటలేక ఎక్కడి కూలీలు.. రైతులు అక్కడే గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఇక కొందరు శివపల్లి గ్రామస్తులు గూడెంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటున్న తమ పిల్లలను చూసి తిరిగి వస్తుండగా, శివపల్లి వాగు ఉధృతంగా ప్రవహించడంతో అక్కడే ఆగిపోయారు. రాత్రి దిందా-కేతిని వాగుల ఉధృతి తగ్గగా, స్థానిక నాయకులు ట్రాక్టర్ల ద్వారా ఆయా గ్రామాల రైతులను దాటించారు. ఇక గూడెం వెళ్లిన శివపల్లి గ్రామస్తులు, గూడెంలోనే ఉన్నట్లు తెలిసింది.



వ్యవసాయ పనులకు వెళ్లి వాగు వద్ద చిక్కుకున్న కేతిని గ్రామస్తులు


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679